
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 26



# ఇప్పుడొస్తున్న కాల్పనిక సాహిత్యం అంతా ట్రాష్!

## - యండమూరి వీరేంద్రనాథ్

అప్పటికీ ఇప్పటికి ఎప్పటికి అతి పెద్ద కమర్షియల్ రచయిత యండమూరి వీరేంద్రనాథ్. పాఠకుల నాడిని తెలుసుకుని వారికి నచ్చే రీతిలో పుస్తకాలను అందించటంలో ఆయనకు ఆయనే సాటి. నవలా రచయితగా, నాటక రచయితగా, మానసిక వికాస పుస్తక రచయితగా బహుముఖ ప్రజ్ఞను కనబరచిన యండమూరిలో మరుగునపడిన మరో కోణం కూడా ఉంది. సాహితీ రంగంలోకి వచ్చిన తొలినాళ్లలో యండమూరి అనేక కథలు రాశారు. ఇవి తర్వాతి కాలంలో సంపుటాలుగా కూడా వెలువడ్డాయి. కథా రచయిత యండమూరితో కాస్సేపు కబుర్లు మీకోసం...

**ప్రశ్న: కథలు రాయటానికి మీకు ప్రేరణ ఏమిటి?**

**జవాబు:** చిన్నప్పుడు నాకు చాలా ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్ ఉండేది. ఎవరితోను ఎక్కువగా కలిసేవాడిని కాను. ఇంట్రావర్ట్‌ని. కాని చుట్టు పక్కలున్న పరిస్థితులను చాలా జాగ్రత్తగా గమనిస్తూ ఉండేవాడిని. నేను రాసిన కథ ఒకటి చందమామలో అచ్చయింది. అప్పుడు చాలా మంచి ఫీలింగ్ కలిగింది. ఒక ఇంట్రావర్ట్ అయిన వ్యక్తికి బయట నుంచి ప్రశంసలు వస్తుంటే కలిగే ఆ ఆనందమే నాకు ప్రేరణ. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఒక నాటిక రాశా. సాధారణంగా వారపత్రికల్లో నాటికలు ప్రచురించటం చాలా అరుదు. కాని ఆ పత్రిక ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారికి ఆ నాటిక చాలా నచ్చింది. ఆ నాటికకు కూడా చాలా ప్రశంసలు వచ్చాయి. ఆ తర్వాత నేను రాసిన 'రఘుపతి..రాఘవ..రాజారాం' అనే నాటికకు అనేక అవార్డులూ, ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించింది. ఇవి నా రచనలకు ప్రేరణలు.


భార్య, కుమారునితో...

**ప్ర: ఒక రచయితపై అమ్మ,నాన్న , ఇతర కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాలు.. చుట్టూ ఉన్న పరిస్థితులు ప్రభావం చూపుతాయంటారు. మీపై అలాంటి ప్రభావాలు ఉన్నాయా?**

**జ:** తప్పకుండా ఉన్నాయి. మాది పెద్ద కుటుంబం. ఐదుగురు అన్నదమ్ములం. మా అమ్మది జమిందారి కుటుంబం అని చెప్పచ్చు. మా నాన్న సామాన్య కుటుంబీకుడు. కాని చాలా ఓర్పు ఉన్న మనిషి. క్రికెట్ ఆడటం దగ్గర నుంచి.. కలిసి పుస్తకాలు చదవటం దాకా.. మాతో ఓ స్నేహితుడిలా కలిసిపోయేవాడు. అమ్మ విషయానికి వస్తే- బహుశా ధనవంతుల ఇంటి నుంచి వచ్చాననే భావన ఏ మూలో ఉండేదనుకుంటా. అయితే అది పిల్లలపై పడకుండా మా నాన్న కాసుకొనేవాడు. ఇక పరిస్థితుల ప్రభావం నాపై చాలా ఉంది. పేదరికాన్ని అనుభవించాను కాబట్టి.. దాని నుంచి బయటకు రావాలనే బలమైన కాంక్ష నాలో ఉండేది. ఎలాగయితేనేం బయటపడ్డాను.

**ప్ర: మీరు సాహితీ రంగంలో అన్ని ప్రక్రియలలోను మీదైన ముద్ర వేశారు. కథ, నవల, నాటిక, సినిమా స్క్రీన్‌ప్లే... వీటన్నింటిలో బాగా కష్టమైనది ఏది?**

**జ:** చాలా ఆసక్తికరమైన ప్రశ్న. నా దృష్టిలో అన్నింటి కన్నా నాటకం రాయటం చాలా కష్టం. ప్రతి రెండు నిమిషాలకు ప్రేక్షకుడికి ఆసక్తి కలిగేలా చేయాలి. వాళ్లని ప్రేరేపించాలి. ఇది చాలా కష్టమైన ప్రక్రియ. ఇక రెండో స్థానం కథానికకు ఇస్తా. ఒక బలమైన భావన ఎక్కడా చెడిపోకుండా తక్కువ నిడివిలో పాఠకులకు అందించాలి. మూడో స్థానం సినిమా స్క్రీన్‌ప్లేది. ఒక సినిమాకు ప్రాణం స్క్రీన్‌ప్లే. సినిమా ఆడినా, ఓడినా స్క్రీన్‌ప్లేనే కారణమవుతుంది. ఆ తర్వాత స్థానం కథది. కథ తర్వాత స్థానం నవలకు ఇస్తా. నవలలో మనం ఏం కావాలనుకుంటున్నామో అది రాసుకొనే సౌలభ్యం ఉంటుంది. ఎంత కావాలంటే అంత పొడిగించుకొనే సౌకర్యం కూడా ఉంటుంది. ఇక అన్ని ప్రక్రియల్లోను చాలా సులవైనది డైలాగ్స్ రాయటం. ముఖ్యంగా సినిమా డైలాగ్స్ రాయటం. దర్శకుడు, నిర్మాత కూడా ఉంటారుగా.. చెప్పటానికి(నవ్వు)

**ప్ర: మీకు బాగా నచ్చిన రచయితలెవరు?**

**జ:** ఒకరు అని చెప్పలేను. చిన్నప్పటి నుంచి ఇప్పటి దాకా ఒకో దశలో ఒకొక్కరు నచ్చారు. కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, కొమ్మూరి వేణుగోపాలరావు, యద్దనపూడి సులోచనారాణి, రావి శాస్త్రి, చలం, గొల్లపూడి మారుతీరావు...ఇలా అనేక మంది నచ్చారు. మనం ఏ దశలో ఉన్నాం అనే విషయంపైనే మనకు ఎలాంటి రచనలు నచ్చుతున్నాయనే విషయం ఆధారపడి ఉంటుంది. మానసిక పరిణతి, వయస్సుతో పాటుగా ఇష్టాలు కూడా మారిపోతాయి.

**ప్ర: వర్తమాన తెలుగు సాహిత్యంపై మీ అభిప్రాయమేమిటి?**

**జ:** వర్తమాన తెలుగు సాహిత్యాన్ని నేను చాలా తక్కువగా చదువుతున్నాను. ఇక ప్రస్తుతం వస్తున్న సాహిత్యంలో 90 శాతం ట్రాష్ ఉంటోంది. 'సాయంత్రం అయింది. హైదరాబాద్‌లో సముద్రం దగ్గర...' లా మొదలయ్యే రచనలు ఎన్నో. అలాంటి వాటిని ఎలా చదవగలం చెప్పండి?

**ప్ర: ప్రస్తుత సాహిత్యం ట్రాష్ అన్నారు కదా.. మంచి రచయితకు మీరు ఇచ్చే నిర్వచనమేమిటి?**

**జ:** ప్రొఫెషనల్ రచయితకు మంచి రచయితకు తేడా ఉంది. మేం అందరూ ప్రొఫెషనల్ రచయితలం. పల్ప్ ఫిక్షన్ రాస్తాం. పాఠకులకు ఏది కావాలో అది అందిస్తాం. మంచి రచనలు వేరు. మారుతున్న పరిస్థితుల్లో పల్ప్ ఫిక్షన్‌ను ఎవరూ చదవటం లేదు. అందుకే మేం రాయటం లేదు. రాసినా ఎవరూ చదవరు. ఈ పల్ప్ ఫిక్షన్ స్థానాన్ని టీవీ ఆక్రమించేసింది. ఇప్పుడు అందరూ టీవీనే చూస్తున్నారు. పల్ప్ ఫిక్షన్ చదవటం లేదు.

**ప్ర: అయినా పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గలేదే?**

**జ:** తగ్గలేదు. నిజమే! అయితే వాళ్లు చదివే పుస్తకాలు వేరు. తమకు నచ్చిన సబ్జెక్ట్ మీద పుస్తకాలు చదువుతున్నారు. అలాంటి రచనలు కూడా వస్తున్నాయి. ఉదాహరణకు ఇటీవలే నేను 'కైట్ ఫైయర్స్' అనే పుస్తకం చదివాను. చాలా బావుంది.

**ప్ర: మీరు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాల వైపు మళ్లటానికి ఇది కూడా ఒక కారణమా?**

**జ:** ప్రొఫెషనల్ రైటర్ అనేవాడు పాఠకుల అభిరుచికి తగ్గట్టుగా రాయాలి. నేను ప్రొఫెషనల్ రైటర్‌ని. నా వృత్తి రచనలు చేయటం. అందుకే చేస్తున్నా. ఇదే సమయంలో వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలపై పాఠకులు మంచి ఆదరణ చూపుతున్నారు. ఉదాహరణకు నా 'విజయానికి ఐదు మెట్లు' పుస్తకాన్ని తీసుకోండి. రెండు కోట్ల రూపాయల విలువైన పుస్తకాలు అమ్ముడయ్యాయి. అంటే అర్థం...పాఠకులకు ఈ పుస్తకం బాగా నచ్చిందనేగా!



**ప్ర: మీరు చాలా కష్టపడి రాసిన పుస్తకమేది?**

జ: కొన్ని పుస్తకాలు చాలా కష్టపడి రాస్తాం. కాని పాఠకులకు నచ్చవు. కొన్ని చాలా సునాయాసంగా రాసేస్తాం. విపరీతమైన హిట్ అవుతాయి. ఉదాహరణకు నేను చాలా సులభంగా రాసిన పుస్తకం 'వెన్నెల్లో ఆడపిల్ల'. కష్టపడి రాసిన పుస్తకం 'కాసినోవా 99'. పెద్ద ఫ్లాప్. అలాగే కష్టపడి రీసెర్చ్ చేసి రాసిన పుస్తకం 'విజయానికి ఐదుమెట్లు'. అది సూపర్ హిట్ అయింది. కొన్ని పుస్తకాలు ఉన్నాయి. పబ్లిషర్స్, ఎడిటర్స్ ఒత్తిడి మీద రాసినవి. 'అష్టావక్ర' అలా ఒత్తిడి మీద రాసిందే! అప్పటికే తులసి, తులసిదళంలో చెప్పాల్సిందంతా చెప్పేశాను. అయినా అప్పుడే కొత్తగా ఓ పత్రిక పెట్టారు. దాని ఎడిటర్ ఓ సీరియల్ కావాలన్నారు. తప్పని పరిస్థితి. అందుకే 'అష్టావక్ర' రాయాల్సి వచ్చింది. ప్రొఫెషనల్ రైటర్‌కు ఇవన్నీ తప్పవు.

**ప్ర: ఒక పుస్తకం ఎందుకు ఫ్లాప్ అయింది అనే విషయాన్ని ఆత్మశోధన చేసుకుంటారా?**

జ: తప్పకుండా. లేకపోతే ఈ వృత్తిలో ఇంతకాలం ఎలా ఉండగలను? ఒక పుస్తకం ఫ్లాప్ అయిందంటే.. ఎందుకు అయిందనే విషయాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలించి ఒక అంచనాకు వస్తా.

**ప్ర: ఒక పాఠకుడి పట్ల ఏ మేరకు రచయిత నిబద్ధత కలిగి ఉండాలి?**

జ: ఏ మేరకు అంటే చెప్పలేనుగాని, చాలా నిబద్ధతగా..హానెస్ట్‌గా ఉండాలి. పాఠకుడిని మోసం చేయకూడదు. పుస్తకంలో ఏ చిన్న తప్పూ దొర్లనివ్వకూడదు. అప్పుడే పాఠకుడికి విశ్వసనీయత ఏర్పడుతుంది. ఉదాహరణకు నేను రాసే ఏ పుస్తకంలోనైనా ఒక్క అచ్చు తప్పు కూడా రానివ్వను. కేవలం ప్రూఫ్‌లు చూడటానికి ఐదుగురు ఉంటారు. మొదటి ప్రింట్ అయిన తర్వాత ఏవైనా తప్పులు ఉన్నాయంటే వాటిని కూడా రెండో ప్రింట్‌లో మార్పిస్తా. అంతదాకా ఎందుకు.. నిన్న అఫ్గానిస్థాన్ బోర్డర్ గురించి రాయాల్సి వచ్చింది. గూగుల్‌కి వెళ్లి వెతికాను. ఇప్పటిదాకా అఫ్గానిస్థాన్ మనకూ ఒక సరిహద్దు అనుకొనేవాడిని. కాని అది కాదని తెలిసింది. ఇలా చిన్న చిన్న విషయాలపై శ్రద్ధ తీసుకోవటం చాలా ముఖ్యం.

**ప్ర: కొత్తగా రాయాలనుకొనేవారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?**

జ: పాఠకులను ఆకట్టుకోవటానికి కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 'సన్నగా ఎండ కిటికీలో నుంచి సోఫాలో పడుతోంది.. హాలులో ఓ మూల ఉన్న కుర్చీలో...' ఇలా రాస్తే పాఠకుడికి ఆసక్తి ఉండదు. ఎందుకంటే ఇలాంటి శైలిని, వాక్యనిర్మాణాన్ని కొన్ని వందల సార్లు పాఠకుడు చదివి ఉంటాడు. 'ఆ హాలులో ఓ ఎర్రటి మరక....' అని మొదలుపెడితే పాఠకుడు వెంటనే ఆసక్తిగా చదువుతాడు. కాలం వేగానికి తగ్గట్టుగా మనం కూడా మారాలి.

**ప్ర: మీ హాబీలేమిటి?**

జ: నాకు హాబీలంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ప్రతి రెండు నెలలకు ఒక సారి హాలిడేకు వెళ్లటానికి ఇష్టపడతా. సెలయేళ్లు, ప్రశాంతమైన అడవులు అంటే నాకు ఇష్టం. జోగ్ ఫాల్స్‌కు ఎక్కువగా వెళ్తుంటా. నేను మంచి వంటవాడిని. వంటలు చాలా చేస్తా. చికెన్, మటన్.. ఇలా ఏదైనా సరే.. ఒకసారి ఇంగ్లాండ్‌కు వెళ్లా. అక్కడ తెలుసున్న వాళ్లింట్లో దిగా. ఆ భార్యాభర్తలిద్దరూ రోజు ఉద్యోగాలకు వెళ్లిపోయేవారు. నేను ఇంట్లో వంట చేసేవాడిని. మీకు తెలుసుగా.. అక్కడ వారాంతంలో ఒకసారి వండుకుంటారు. వారమంతా అవే తింటారు. నేను రోజూ వంట చేసి పెట్టేవాడిని. నేను వెళ్లిపోతానంటే వాళ్లు ఇంకొన్ని రోజులు ఉండమన్నారు..బహుశా బాగా వంట చేస్తున్నాను కాబట్టి కావచ్చు.. (నవ్వు)

**ప్ర: ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు?**

జ: సాధారణంగా నాకు ఖాళీ అంటూ ఉండదు. దాదాపు కోటి రూపాయలతో కాకినాడలో 'సరస్వతి విద్యాపీఠాన్ని' నెలకొల్పా. అక్కడ అనాథ బాలలకు చదువు చెప్పిస్తాం. ఇక ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లి స్ఫూర్తి దాయకమైన ప్రసంగాలు ఇస్తుంటా. వీటితోనే సరిపోతుంది.

**ప్ర: మీ జీవితంలో మరచిపోలేని సంఘటన..**

జ: 'రఘుపతి..రాఘవ..రాజారాం' నాటికను ప్రదర్శించినప్పుడు ప్రేక్షకులు కొట్టిన చప్పట్లు. అవి నిజంగా టానిక్‌లా పనిచేసాయి.

**ప్ర: జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందికరమైన సంఘటనలు..**

జ: అవి కూడా ఉన్నాయి.. జ్యోతి ఆత్మహత్య..ఆంధ్రాబ్యాంక్ కుంభకోణం గురించి పుకార్లు ఇలా.. అయినా ఇలాంటి వ్యవహారాల్లో ఎంతో కొంత తప్పు ఉండే ఉంటుంది.. రాసిన ఒక ఉత్తరమో..ఎక్కడో పెట్టిన సంతకమో..

**ప్ర: మీరు చాలా మంది యువతీయువకులతో మాట్లాడుతూ ఉంటారు కదా.. గతానికి ఇప్పటికి తేడా ఏదైనా ఉందా?**

జ: ఇప్పుడు యువతలో ఒక విధమైన రెస్ట్‌లెస్‌నెస్ ఉంది. ఒక గమ్యం లేదు. ఎందుకంటే వాళ్లకి తల్లితండ్రులు అన్నీ అమర్చిపెడుతున్నారు. దీని వల్ల వాళ్లకి కొన్ని కష్టాలు తెలియవు. ఆకలి వేసినప్పుడు తినటానికి ఏం లేకపోవటం.. రోగం వచ్చినప్పుడు వేసుకోవటానికి మందులు లేకపోవటం కన్నా కష్టాలేముంటాయి ఈ ప్రపంచంలో.. ఇవి అనుభవిస్తే కష్టమేమిటో తెలుస్తుంది. ఇవి తెలియకపోవటం వల్ల తమకు తెలిసినవే కష్టాలనుకుంటున్నారు. వాటి కోసం బాధపడుతున్నారు.

**ప్ర: ఐటీ జనరేషన్ వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయిందనేది కొందరి భావన..**

జ: నిజమే! ఐటీలో ఉన్న వాళ్లు దేని కోసం పనిచేస్తారు? కంపెనీకి లాభం కోసం పగలనకా..రాత్రనకా పనిచేస్తూ ఉంటారు. తను..తన కుటుంబం..తన చుట్టూ ఉన్న ప్రపంచం.. ఇలాంటి ఫీలింగ్స్ అన్నీ క్రమేణా తగ్గిపోతాయి. ఇవన్నీ నా పుస్తకంలో రాస్తున్నా..

**ప్ర: ఒక నిండైన జీవితానికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి?**

జ: దేనికీ బాధపడకుండా జీవించగలగటం. ప్రస్తుతం జీవితంలో నాకు ఎలాంటి వర్రీలు లేవు. ఎవరి మీద కోపం రాదు. క్రికెట్ మ్యాచ్ వచ్చినప్పుడు కరెంట్ తీసేశాడనో.. వాటర్ బిల్లు సక్రమంగా రావటం లేదనో తప్ప. చాలా మంది రేపు ఆనందంగా ఉండటం కోసం ఈ రోజు కష్టపడతారు. ఆ రోజు ఆనందంగా ఉండటం కోసం బతికితే అస్సలు వర్రీలే ఉండవు.

**-సివిఎల్ఎన్**

నాకు నచ్చిన నా కథ

# మిక్స్

- యండమూరి వీరేంద్రనాథ్

భానుమూర్తికి ఆ సంవత్సరాంతపు ఇంక్రిమెంట్ వచ్చి బేసిక్ ఇంకో ఇరవై అయిదు రూపాయలు పెరిగినప్పుడు యింతకు ముందు కన్నా సంతోషించాడు. ఈ పెరుగుదలతో అతడికి రైల్లో ఫస్ట్‌క్లాస్‌లో వెళ్లే అర్హత లభిస్తుంది.

ఇంక్రిమెంట్ ఆర్డర్ చేతికి రాగానే అతడు చేసిన పని - ఫైల్సన్నీ వెతికి, బైట ఊరు వెళ్ళాల్సిన పనిని వెతికి పట్టుకోవటం. అదృష్టవశాత్తూ కలకత్తాలో అటువంటి పని వున్నట్టు కనబడింది. వెంటనే ఆఫీసర్‌కి నోట్ పెట్టాడు. ఏ మూడ్‌లో వున్నాడో గానీ ఆఫీసర్ ''ఎస్'' అన్నాడు. ఆ రోజు సాయంత్రమే అతడు స్టేషన్‌కి వెళ్ళేడు.

ఠీవిగా ''సమశీతోష్ణ మరియు మొదటి తరగతి రిజర్వేషన్‌లు'' వ్రాసి వున్న విండో దగ్గిరకు నడిచేడు.

అతడు అంతకు ముందు చాలాసార్లు పొడవాటి క్యూల్లో నిలబడి మూడో తరగతి టిక్కెట్లు కొన్నాడు. అలా నిలబడి వున్నప్పుడు అతడి దృష్టి మొదటి తరగతి కౌంటర్ మీద పడేది. చకచకా నడుచుకుంటూ వచ్చి, టిక్కెట్ కొనుక్కుని అదే స్పీడ్‌లో వెళ్ళిపోయే హుషారైన బెల్‌బాటమ్ అమ్మాయిలను కళ్ళప్పగించి చూసేవాడు.

కానీ ఇప్పటి పరిస్థితి వేరు.

తను టికెట్ తీసుకోవాల్సిన కిటికీ దగ్గిరకు నడుస్తూ - క్రింది తరగతి బుకింగ్ దగ్గర వరుసలో నిలబడ్డ జనం వైపు జాలిగా చూసేడు.

తనున్న 'క్యూ'లో కూడా కొంతమంది తనలాగానూ, కొంతమంది తనకన్నా హీనంగానూ వున్నట్టు గమనించి కొద్దిగా ఆశ్చర్యపోయేడు.

ఫస్టు క్లాసులో ప్రయాణం చేసే బిజినెస్ మాగ్నెట్లు తమ గుమస్తాలనీ, ఆఫీసర్లు తమ నౌకర్లనీ పంపి టిక్కెట్లు తెప్పించుకుంటారనీ జ్ఞాపకం వచ్చింది.

పది నిముషాలు నిలబడి బుకింగ్ దగ్గరకి చేరుకొన్నాడు.

రిజర్వేషన్ కాగితమూ, రెండు వంద రూపాయల నోట్లు లోపలికి పెట్టాడు.

రాక్‌లోంచి టిక్కెట్టు అందుకోబోతూ, స్లిప్‌లో వున్న తారీఖుచూసి, కౌంటర్‌లో క్లర్కు ముంఖం చిట్లించేడు. కాగితాన్ని యివతలికి పడేస్తూ ''బైట బోర్డులో వ్రాసి వుంది కదండీ - బర్తులు ఏవీ ఖాళీ లేవని, ఊరికే మా టైమ్ వేస్టు చేస్తారెందుకు?'' అన్నాడు విసుక్కొంటున్నట్లు.

భానుమూర్తికి క్షణం పాటూ గుండె ఆగిపోయింది. తనకి జరిగిన అవమానం కన్నా - తను ఫస్టు క్లాసులో ప్రయాణం చేయబోవటం లేదనే నిజం అతడిని ఎక్కువ బాధ పెట్టింది. ప్రోగ్రాం ఫిక్స్ అయిపోయింది కాబట్టి వెళ్ళక తప్పదన్న బాధ. ఆ బాధలోనే అతడు వెయిటింగ్ లిస్టు విషయంకూడా మరచి నిరాశగా వెనుదిరిగేడు.

***

కలకత్తాలో తమ బ్రాంచికి వెళ్ళగానే అతడు అడిగిన మొదటి ప్రశ్న ''నా ఫస్టు క్లాసు టికెట్ బుక్ అయిందా?'' అని.

అయిందని వాళ్ళు చెప్పగానే తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ ఊళ్లో అతని పని, అనుకున్న టైమ్‌కే పూర్తయింది.

ఆ రోజు సాయంత్రమే అతని ప్రయాణం.

వెళ్ళబోయే ముందు బ్రాంచి మేనేజర్‌ని కలుసుకోవటానికి ఆయన ఛాంబర్‌లోకి వెళ్ళేడు.

ఎయిర్ కండిషన్డ్ రూములో మెత్తటి తివాసీ మీద నడుస్తూ వుంటే హుందాదానంతటదే వస్తుంది. ఠీవిగా వెళ్ళి యెదుటి కుర్చీలో కూర్చొన్నాడు. నిజానికి బ్రాంచి మేనేజర్ కేడర్ చాలా పెద్దది. అయినా హెడ్ ఆఫీసు నుంచి వచ్చిన వాళ్ళని బ్రాంచి వాళ్ళు గౌరవంగా చూస్తారు.

కొద్దిసేపు హెడ్ ఆఫీసు విషయాలు మాట్లాడి, ''ఎప్పుడు వెళుతున్నారు మీరు?'' అని అడిగేడు మేనేజర్.

''ఈ సాయంత్రమే - కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో'' జవాబిచ్చాడు భానుమూర్తి.

''రెండే హాల్టులు కదా. భువనేశ్వర్, వాల్తేర్. చాలా కంఫర్టబుల్ జర్నీ'' అన్నాడు మేనేజర్.

''ఎన్ని హాల్టులయితే నేం. ఫస్టు క్లాసే కదా?'' క్యాజువల్‌గా అన్నట్టు అన్నాడు భానుమూర్తి.

''రెండో నాలుగో యిస్తే బెడ్‌రోల్స్ ఇస్తారు తీసుకోండి-''

తలూపేడూ భానుమూర్తి. నిజానికి అతనికి బెడ్‌రోల్స్ అంటే ఏమిటో తెలీదు. కానీ ఒక అంతస్థు నుంచి పైఅంతస్థుకి పెరిగేటప్పుడు ఇలాటి చిన్న చిన్న ఆత్మవంచనలు తప్పవు.

అయితే పై అంతస్థులోని వ్యక్తుల్లో మెలగవలసి వచ్చేటప్పుడు తనకీ ఆ స్థాయి కొత్తది కాదని నిరూపించుకోవటం కోసం ప్రవర్తించే ప్రవర్తన ఒకసారి చాలా ఇరకాటంలో పెడుతూ వుంటుంది.

భానుమూర్తికి ఆ రోజు అలాటి పరిస్థితి ఏర్పడింది.

ఆ రోజు డిన్నర్‌కి ఆహ్వానించేడు మేనేజర్. ''ఆరింటికి ట్రైన్ కదా - కొద్దిగా తింటే వాల్తేర్‌లో బ్రేక్ ఫాస్టు తీసుకోవచ్చు''.

భానుమూర్తి కొద్దిగా మొహమాటపడ్డా వెంటనే ఒప్పుకున్నాడు.

మేనేజరు కారులో ''బ్లూ ఫాక్స్'' రెస్టారెంట్‌కి తీసుకెళ్ళాడు.

భానుమూర్తి మనసు అదోలా వుంది. అది పూర్తిగా ఆనందమూ కాదు... గర్వమూ కాదు. ఏదో పెరిగిపోయిన పరిస్థితి. అప్పర్ సర్కిల్స్‌లో మొదటిసారి మెలుగుతున్న ఫీలింగ్ అతనిలో తెలియని ఉద్వేగాన్ని కలిగిస్తోంది. అదేమీ కొత్తకాదు అన్నట్టు వుండటానికి మొహాన్ని సీరియస్‌గా పెట్టి మేనేజర్‌తో పాటు వెళ్ళి కూర్చొన్నాడు.

టేబిల్ మీద ఉన్న 'మెనూ' తీసుకొని చూస్తూ ''ఏం తీసుకుంటారు?'' అని అడిగేడు మేనేజర్.

భానుమూర్తి మాట్లాడలేదు. నిజానికి అక్కడ ఏం దొరుకుతాయో అతడికి తెలీదు.

ఇంతలో మేనేజర్ అతడికి మెనూ కార్డు అందిస్తూ ''మీకేం కావలో చెప్పండి'' అన్నాడు.

భానుమూర్తి కార్డు చూసేడు.

మిక్స్ నూడుల్స్, సాఫ్ట్ నూడుల్స్, చికిన్ టిక్కా వగైరా, కార్డు ఇచ్చేస్తూ ''ఇక్కడేం బావుంటాయో మీరే ఆర్డర్ ఇవ్వండి'' అన్నాడు.

ఇంతలో బేరర్ వచ్చేడు.

మేనేజర్ చకచకా తనకి కావల్సినవి ఆర్డర్ ఇచ్చి భానుమూర్తి వైపు తిరిగేడు. ఇక ఇతడికి తప్పలేదు. మెనూ మళ్ళీ చేతిలోకి తీసుకొన్నాడు. అతడికి తెలిసింది అందులో 'చికెన్' అన్న పదం ఒక్కటే.

'చికెన్ టిక్కా' అన్నాడు – కార్డు పడేస్తూ.

''అంతేనా?'' అడిగాడు మేనేజర్.

ఇంకేమనాలో తెలీక ''అంతే'' అన్నాడు.

''ఇంకేమన్నా తీసుకోండి?''

భానుమూర్తి ఇంతవరకూ వచ్చేక వెనక్కి వెళ్ళదల్చుకోలేదు.

''ఇంకేమొద్దు. ట్రైన్ జర్నీలో ఎక్కువ తినను'' అన్నాడు తన మాటమీద నిలబడుతూ.

ఇంతలో బేరర్ ట్రేలో పదార్థాలు తెచ్చేడు.

భానుమూర్తి ముందు పెట్టిన పేట్లో మూడు నాలుగు చిన్న పకోడీల్లాంటివి పుల్లలు గుచ్చి వున్నాయి.

దాంతోనే ఆ రోజు రాత్రికి అతడు సరిపెట్టుకోవలసి వచ్చింది. కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో నైట్ డిన్నర్ సర్వ్ చేస్తారని అతనికి తెలీదు.

***

అయిదూ నలభై అయిదుకల్లా భానుమూర్తి స్టేషన్ చేరుకున్నాడు.

అతడికి మనసంతా టెన్షన్‌గా ఉంది. అతడెప్పుడూ ఫస్టు క్లాసులో ఎక్కలేదు. అసలు లోపల ఎలా వుంటుందో చూడలేదు కూడా.

చంద్రమండలం మీద దిగబోతున్నప్పుడు ఆర్మ్‌స్ట్రాంగ్ మనసులో ఉద్వేగం లాంటి టెన్షన్ అతడిలోనూ పేరుకుపోయింది.

వరసగా చూసుకుంటూ వెళ్తుండగా ఒక కంపార్టుమెంట్ ముందున్న లిస్టులో తన పేరుంది.

కానీ ఏ సీటు...?

చాలాసేపు అక్కడే నిలబడి లిస్టుని పూర్తిగా అందరి పేర్లతో సహా చదివేడు.

టిక్కెట్ తీసి నెంబరు పరీక్షించి సంతృప్తిపడ్డాడు.

కానీ సీటు తెలియటం లేదు.



అంతలో అతని పక్కగా ఎవరో ''ఏ - టూ'' అనుకొంటూ లోపలికి వెళ్ళిపోయేడు. దాంతో అతడికి అర్థమై తన పేరుముందు చూసుకున్నాడు. అతనిది ''ఇ-త్రి''.

సూట్‌కేస్ పట్టుకొని లోపలికి నడిచేడు. చిన్న కారిడారూ, వరసగా క్యాబిన్సూ ఉన్నాయి. అందులో ఏది 'ఇ' క్యాబినో తెలీటం లేదు.

'ఇ' అంటే అయిదోది అయివుండాలి. కానీ అట్నుంచా - ఇట్నుంచా?

అతడి విషమ పరిస్థితిని ఇంకా ఎక్కువ సేపు ఉంచడం ఇష్టం లేనట్లు దేముడు అంతకు ముందు ''ఏ-టూ'' అన్న వ్యక్తిని పంపించేడు.

అట్నుంచి అయిదో క్యాబిన్‌లోకి వెళ్ళబోతూండగా తలమీద పెద్ద అక్షరం 'ఇ' కనబడింది.

పైకి చూడాలనే ఆలోచన అప్పటివరకూ రానందుకు తనని తిట్టుకొన్నాడు.

లోపల అతడి బర్త్‌ని సులభంగానే గుర్తు పట్టేడు. సూట్‌కేస్ కాళ్ళ క్రింద పెట్టి, తీరిగ్గా కూర్చొని కంపార్ట్‌మెంట్‌ని పరిశీలించేడు.

రెండు బెర్త్‌లకి  మధ్య అద్దం వుంది. డైనింగ్ ప్లేట్ ఉంది. సీట్లు మెత్తగా ఉన్నాయి. బ్యాక్ రెస్టుకి అనుకొంటే హాయిగా ఉంది. డెకోలామ్ ప్లేట్ల మీద లైట్ల కాంతి అందంగా మెరుస్తోంది. అతని పరిశీలన ఇంకా సాగేదే కానీ అంతలోనే ఆ క్యాబిన్‌లోకి ఇంకో ప్రయాణీకుడు వచ్చేడు.

నల్లటి ప్యాంట్‌మీద తెల్లటి చొక్కా ఇన్‌షర్ట్ చేసుకున్నాడు. బ్లూ టై కట్టుకొన్నాడు. రిమ్‌లెస్ కళ్ళజోడు పెట్టుకున్నాడు. తల కొద్దిగా నెరిసి వుంది. స్మార్ట్‌గా, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లా ఉన్నాడు.

ఇంతలో బైట కారిడార్‌లో కలకలం వినిపించింది.

పోర్టర్ బెడ్డింగ్ తీసుకొచ్చి పెట్టి వెళ్ళిపోయాడు.

వెనుకే నిలబెట్టిన బెడ్డింగులా ఉన్నాయన వచ్చాడు. అతనితో పాటు పది మంది... పూలదండలు... గొడవ... నమస్కారాలు... మాజీ మినిష్టరు గారట.

భానుమూర్తికి ఊపిరాడలేదు. ఎలాగో దారిచేసుకొని బయట కొచ్చేడు. ప్లాట్‌ఫాం రష్‌గా ఉంది. చక్రాల బండిమీద పుస్తకాల వాడొచ్చేడు.

ఏం కొందామా అన్న ఆలోచన... తెలుగు పుస్తకాలు కూడా ఉన్నాయి.

క్షణం ఆలోచించి ఇలస్ట్రేటెడ్ వీక్లీ కొన్నాడు.

ఇంతలో గార్డు విజిల్ వినబడింది.

పది రూపాయల నోటు తీసి పుస్తకాల వాడికిచ్చాడు. వాడు విసుగ్గా ''చిల్లర లేదా?'' అన్నాడు హిందీలో.

లేదన్నాడు భానుమూర్తి.

వాడు విసుక్కుంటూ నాలుగు అర్థ రూపాయి కాసులు, ఆరు పావలాలు, మిగతావి పది పైసలు బిళ్ళలూ కుప్పగా అతడి చేతిలో పోసేడు.

అవో చేత్తోనూ, వీక్లీ ఒక చేతిలోనూ పట్టుకొని కదులుతున్న ట్రైన్ ఎక్కేడు భానుమూర్తి.

అతడు తన క్యాబిన్‌లోకి వచ్చేసరికి మూడో ప్రయాణికుడు కూడా వచ్చేడు. అతడో యువకుడు. వెనుకనుంచి ఆడదానిలా, ముందునుంచి మధ్యస్తంగా ఉన్నాడు. చూయింగ్ గమ్ నవుల్తూ కాలుమీద కాలేసుకుని ఆడిస్తూ ఉన్నాడు. నల్లటి పాయింటెడ్ షూ మీద లైట్ల కాంతి మెరుస్తోంది. ఫస్టుక్లాస్ కంపార్టుమెంట్‌లోనే పుట్టినట్లు క్యాజువల్‌గా వున్నాడు.

భానుమూర్తికి ఒక్కసారిగా భరించలేని నిస్సత్తువ ఆవరించింది. అయిదుగురు ఆఫీసర్ల మధ్యకు వెళ్ళి ఫైల్ అందించవలసిన ఎల్డీసీ పరిస్థితిలా వుంది. మామూలుగా వుండటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

మాజీ మినిస్టర్ గారూ, బిజినెస్ మాగ్నెట్‌లా వున్నాయనా బెంగాలీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.

చిల్లర చప్పుడవకుండా జేబులో వేసుకొన్నాడు.

''ఇ-త్రి'' అంటే అప్పర్ బెర్త్. ఇప్పుడే వెళ్ళాలో యింకొంచెం సేపు వుండొచ్చో తెలీదు.

అయినా ''ఇ-వన్'' ఆయన యింకా కూర్చొనే వున్నాడు కదా! అతని ఆలోచనల్ని చెదరగొడుతూ ''టు డే యిట్స్ గోయింగ్ ఐ థింక్ ఎ బిట్ స్లో....'' అన్నాడు కుర్రవాడు. తల తిప్పినప్పుడు అతని చెంపల మీద జుత్తు షోగ్గా కదులుతోంది.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్ తలూపేడు.  అతడు మళ్ళీ కిటికీలోంచి బయటకు చూడ్డంలో మునిగి పోయాడు.

మంత్రిగారు హిందీ పేపరూ, బిజినెస్ ఎగ్జిక్యూటివ్ బెంగాలీ మాగ్‌జైన్ చదువుతున్నారు.

భానుమూర్తి ఇలస్ట్రేటెడ్ వీక్లీ తీసి హెడ్డింగులు చూస్తూ పేజీలు తిరగెయ్య సాగాడు.

ఇంతలో తలుపు తెరుచుకొని కాకీ బట్టలు వేసుకున్నతను లోపల కొచ్చేడు.

భానుమూర్తి టికెట్ కోసం జేబులో చెయ్యి పెడుతూంటే, ''నైట్ డిన్నర్ సార్...'' అన్నాడు.


అక్కడివరకూ వెళ్ళిన చేతిని కాలిమీద గోక్కోవటం కోసం వినియోగించి తల అడ్డంగా ఊపాడు భానుమూర్తి.

మిగతా ముగ్గురి దగ్గిరా ఆర్డరు తీసుకొని వాడు వెళ్ళిపోయాడు.

ఇంతలో మాజీ మంత్రిగారు లేచి బైటకు వెళ్ళి వచ్చేరు.

భానుమూర్తి బలంగా ఊపిరి పీల్చుకొని వదిలేడు. నిజానికి తడడు బైటకి వెళ్ళాల్సిన అవసరం ఎప్పట్నుంచో వుంది. కానీ కంపార్టుమెంట్‌లోకి రాగానే, వెంటనే మళ్ళీ బైటకు వెళ్తే మరీ పల్లెటూరి వాడిలా వుంటుందని ఇంతసేపూ ఊరుకున్నాడు.

భానుమూర్తి తిరిగి వచ్చేసరికి ముగ్గురూ డిన్నర్ చేస్తున్నారు.



తలుపు తెరిచిన భానుమూర్తి, వాళ్ళందరూ ఒక్కసారిగా తనకేసి తిరిగే సరికి ఇరకాటంలో పడ్డాడు. బయటకు వెళ్ళిపోదామో అనుకొని, మళ్ళీ అది బాగోదని లోపలికి వచ్చి కూర్చున్నాడు.

కుర్రవాడు ఆమ్లెట్‌ని ఫోర్క్‌తో తింటున్నాడు. మంత్రిగారు బాయిల్డ్ ఎగ్స్‌ని కత్తితో కోస్తున్నారు.

"మీరేం తీసుకోవటం లేదే?" ఇంగ్లీషులో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అడిగే సరికి తత్తరపడ్డాడు.

అప్పటివరకూ అటే చూస్తున్న భానుమూర్తి చప్పున దృష్టిమార్చి "నేను ట్రైన్ ఎక్కేముందు తినేశానండి" అన్నాడు ఇంగ్లీషులోనే.

ఇది జరిగాక యింక అతనికి కూర్చోబుద్ధి కాలేదు. ఏదో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ మనసుని తొలిచేస్తూంది. లేచి బర్త్ మీదకు వెళ్ళి పడుకున్నాడు.

బ్యాగ్‌లో పంచె వుంది, కానీ కట్టుకోవటం యేం బాగుంటుంది? అసలు కట్టుకోవటం ఎక్కడా? బయటకు తీసికెళ్తే తను వెళ్ళగానే వీళ్ళు నవ్వుకుంటారేమో?

వాళ్ళ డిన్నర్ పూర్తయింది.

ఆడదాన్లా వున్న కుర్రాడు పూల లుంగీ తీసి అక్కడే కట్టుకున్నాడు.

లైట్లు ఆర్పి, బెడ్‌లైటు వేసేరు.

నీలి సబ్‌ట్యూబ్ లైటింగ్ క్యాబిన్ అంతా పరచుకొని ఉంది.

భానుమూర్తికి నిద్ర రావటం లేదు.

కారణం – ఫ్యాను.

చల్లటి గాలి, మొహం మీదకు కొడుతోంది చల్లగా... సూదులతో గుచ్చుతున్నట్లు...

దానికి తోడు, ఆకలి. చికెన్ టిక్కా పేరు మీద తిన్న మూడు ముక్కలూ ఎప్పుడో అరిగిపోయాయి.

అటూ ఇటూ పొర్లుతున్నాడు.

కదిలినప్పుడల్లా యిరుకు ఫ్యాంటు గరగరలాడి చిరాకును కలిగిస్తుంది.

ఆ ఇబ్బందితోనే అతడికి తెల్లవారు ఝాము నెప్పుడో నిద్రపట్టింది.

............

రెండు గంటలన్నా అతడు నిద్రపోయాడో లేదో మెలుకువ వచ్చేసింది.

తెల్లవారి పోతూంది. అందరూ లేచే వున్నారు. వైజాగ్ దగ్గిర పడుతోంది. భానుమూర్తి ఆదరాబాదరా లేచి మొహం కడుక్కొని వచ్చేసరికి స్టేషన్‌లో ఆగింది రైలు.

అతడు దిగి టిఫిన్ తిన్నాడు.

అప్పటికి గానీ ఆత్మారాముడు చల్లబడలేదు. నిద్ర లేకపోవటం వలన కళ్ళు మండుతున్నా, రాత్రి నుంచి బాధిస్తూన్న ఆకలి తీరటం వల్ల కొంత ప్రశాంతంగా వుంది.

అతడు తిరిగి తన కంపార్టుమెంట్‌కి వచ్చేసరికి చిన్నగొడవ జరుగుతోంది.

"నా దగ్గిర చిల్లర లేదు" అంటున్నాడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్.

కాఫీలవాడు అవతల్నుంచి గోల చేస్తున్నాడు.

"అయిదు రూపాయల చిల్లరుందా?"

"తీసుకొస్తాను సార్".

ఎగ్జిక్యూటివ్, మంత్రి గారి వైపు తిరిగి "చూసేరా తీసుకొస్తాడట. అట్నుంచి అటే వెళ్ళిపోవడానికి ఎత్తు" అన్నాడు ఇంగ్లీషులో.

భానుమూర్తికి తన దగ్గర కుప్పగా వున్న చిల్లర జ్ఞాపకం వచ్చింది. కానీ దాన్ని బయట పెట్టడానికి సిగ్గేసింది.

కుర్రవాడు టాయిలెట్‌కి వెళ్ళినట్టునాడు.

"ముందు చిల్లర తీసుకురా – అయిదు రూపాయల నోటిస్తాను".

"అలా ఇవ్వరు బాబూ"

"మరి నీకు అయిదు యివ్వగానే రైలు కదిల్తే–" తన లాజిక్‌కి తనే నవ్వుకుంటూ మాజీ మంత్రి గారన్నారు.

"పరుగెత్తుకొస్తా సార్".

"నమ్మకం ఏమిటోయ్?" అన్నాడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్.

"ఈ రైల్వే ప్లాట్ ఫారం మీద వాళ్ళని నమ్మకూడదు. కొంచెం వీలు చిక్కితే ప్రయాణీకుల్ని మోసం చేస్తారు".

"అవును. ఆ ట్రెండ్ తెలుస్తూందిగా".

ఈలోగా కాఫీవాడు బ్రతిమలాడుతున్నాడు. "ఈ అర్ధ రూపాయి పోతే మళ్ళీ పది గ్లాసులమ్మితే గానీ నష్టం పూడదు" వాడికి హిందీలో సరిగ్గా ప్రవేశం లేకపోవడంతో తడబడుతున్నాడు.

"నీ అర్థరూపాయి కోసం నా నాలుగున్నరా నష్టపొమ్మంటావా?"

మాజీ మంత్రిగారు నవ్వి "కొంచెం డబ్బున్నవాడిని చూస్తే ప్రతివాడికీ లోకువే–" అన్నాడు.

## కథాంతరంగం



ముప్ఫై సంవత్సరాల క్రితం నేను మొట్టమొదటిసారి రైలులో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్నాను. నాతోపాటు మానాన్నగారు కూడా ఉన్నారు. ఆయనకు కూడా ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించడం అదే మొదటిసారి. నేను సీట్లో కూర్చోగానే ఎదుటి సీటుపైన కాళ్లు పెట్టాను. నా పక్కన ఒక విదేశీయుడు ఉన్నాడు.. మా నాన్న కళ్లతోనే కాళ్లు కిందకి దించమన్నట్లు నావైపు చూసి సైగ చేశారు. ఎందుకంటే నా పక్కనున్న విదేశీయుడు ఏమన్నా అనుకుంటాడేమో అనే ఫీలింగ్. మధ్యతరగతి మనుషుల్లో ఉండే లక్షణమే ఇది. సంపన్నులతో స్నేహం చేయాలనుకోవడం, వారిలాగా ప్రవర్తించాలనుకోవడం మధ్యతరగతి జీవుల్లో ఉండే సహజలక్షణం. అలాంటి సందర్భం ఎదురైతే వారు పడే అవస్థలే ఈ 'మిస్ట్'. ఈ కథకు ముప్ఫై సంవత్సరాల క్రితం నా మొదటి ఫస్ట్‌క్లాస్ ప్రయాణ అనుభవమే ఆధారం!

**– యండమూరి వీరేంద్రనాథ్**

"చూడండి, ఎంత నీట్‌గా మనని మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడో, ఏడ్చి చచ్చినా వీడికి యివ్వను"

"వాడికెందుకు అంత పంతం – వెళ్ళి చిల్లర తేవచ్చుగా".

"అలా అయితే అయిదు రూపాయలూ కొట్టేసే వీలుండదుగా–" గార్డు విజిల్ వేసేడు.

కాఫీవాడు కంగారు పడ్తున్నాడు. "బాబ్బాబు – మీకు అయిదు ఒక లెక్కలోది కాదు. కానీ నాకు ఆ అర్ధరూపాయి పోతే కష్టం బాబూ, ఇచ్చేయ్యండి. ఇదో మూడు రూపాయిలున్నాయి. తీసుకోండి–"

ఏదో విజయం సాధించినట్టూ ఎగ్జిక్యూటివ్ నవ్వేడు. "చూశారా వాడికి ఈ డబ్బు కొట్టెయ్యాలనే ఉంది".

రైలు కూత పెట్టింది.

"ఇలా మోసం చేసే వాళ్ళుండ బట్టే దేశం తగలబడి పోతోంది" అన్నారు మంత్రి గారు.

రెలు నెమ్మదిగా కదిలింది.

కిటికీ పట్టుకొని "డబ్బులు బాబూ–" అంటూ వస్తున్నాడు వాడు. తల అడ్డంగా ఊపుతున్నాడు ఎగ్జిక్యూటివ్. అంతలో వాడి కాలు తడబడి నట్టుంది. ప్లాట్ ఫారం మీద బోర్లాపడ్డాడు.

భానుమూర్తి చప్పున కిటికీ నుండి చూశాడు.

వాడు మోచేతుల మీద లేస్తూ ఒకే తిట్టు గొంతు పగిలేలా అరిచేడు. "ఒరే లంజా కొడకా.." గాజులాటి అరిస్టోక్రసీ పటాలున పగిలింది.

భానుమూర్తి చువ్వలా లేచేడు.

ఫ్యాంటు జేబులో కర్చీఫ్‌లో ఉండగా చుట్టిన రెండు గుప్పెళ్ళ చిల్లరలోంచి అర్థ రూపాయి కాసు తీసి ఊహించని వేగంతో ప్లాట్‌ఫారం మీదకు విసిరేడు.

ఆ హడావుడిలో చిల్లర క్యాబిన్‌లో నలుమూలాల పడింది. దాన్ని పట్టించుకోకుండా కాఫీవాడు ఆ అర్థరూపాయిని తీసుకున్నదీ లేనిదీ చూసి, తీసుకోవటం గమనించి సంతృప్తిపడి వెనుదిరిగాడు.

ఎగ్జిక్యూటివ్, మాజీ మంత్రిగారూ భానుమూర్తివైపు కళ్ళప్పగించి చూడసాగారు.

భానుమూర్తి మోకాళ్ళ మీద వంగి చిల్లర ఏరసాగేడు. పుస్తకాల వాడికీ, కాఫీ వాడికీ ఇచ్చిందిపోను, మిగతా డబ్బంతా లెక్క సరిపోయే వరకూ మూల మూలలన్నీ వెతికి, చిల్లర పోగుచేసేడు.

"ప్లీజ్ గివ్ మి యువర్ రుపీస్" అని నాలుగున్నర చిల్లర ఇచ్చేడు.

కడుపు నిండా తినటం వల్ల నిద్ర ముంచుకొస్తోంది ఫ్యాంట్ విప్పి, బ్యాగ్‌లోంచి పంచె తీసి కట్టుకున్నాడు. ఆ తరువాత రాడ్ పట్టుకొని పై బర్త్ మీదకి ఎక్కి, బ్యాగ్ తలక్రింద పెట్టుకుని, ఆ తరువాత రెండు నిముషాలకల్లా నిద్రపోయాడు.

★

**(స్వాతి – 1980)**